సాక్షి నిజామాబాద్

ఆదివారం । 9 । జూలై । 2023



వసతుల్లేని నవీపేట సంత

నవీపేట సంతలో కనీస సౌకర్యాలు లేక కొనుగోలుదారులు, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- 8లో ▸



యజమానులకు బదులుగా..

బెల్ట్ షాపుల యజమానులను కాకుండా అందులో పనిచేసేవాళ్లను అధికారులు బైండోవర్ చేస్తున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

32.6 /24.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమవుతుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టీకాలను సక్రమంగా వేయాలి



డిచ్‌పల్లి: జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరిగే రోజు కంటే ఒక రోజు ముందుగానే ప్రతి ఉప కేంద్రంలో లబ్ధిదారుల జాబితాను తయారు చేసుకుని వారందరికీ సమాచారాన్ని అందజేయాలని డీఎంహెచ్‌వో సుదర్శనం సూచించారు. మండలంలోని అమృతాపూర్‌ను శనివారం ఆయన సందర్శించారు. జీపీలో నిర్వహిస్తున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాలు నిల్వ చేసే శీతలీకరణ పద్ధతులను వైద్య సిబ్బందికి వివరించారు. సీసీ మధుకర్, ఆరోగ్య విస్తరణ అధికారి యెనుగందుల శంకర్, ఏఎ న్‌ఎం అనంత ళీభారాణి, అంగన్‌వాడీ టీచర్ రజిత, ఆశ కార్యకర్తలు రేణుక తదితరులున్నారు.

ఫెయిలయ్యానని విద్యార్థి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షలో ఫెయిల్ కావడంతో జిల్లా కేంద్రంలోని చంద్రనగర్‌కు చెందిన బచ్చు సుమంత్(17) శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సుమంత్ నగరంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. రెగ్యులర్ ఫలితాల్లో ఫెయిల్ కాగా సప్లిమెంటరీ రాశాడు. శుక్రవారం సప్లిమెంటరీలోనూ ఫెయిలయ్యాడు. అయితే మృతుడి తల్లి స్రవంతి అనారోగ్యానికి గురై చిన్న కుమారుడితో ఆస్పత్రికి వెళ్లగా ఈ సమయంలో ఇంట్లోని హాల్‌లో ఫ్యాన్‌కు సుమంత్ ఉరేసుకున్నాడు. తండ్రి బచ్చు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి మహిళా ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిజామాబాద్‌లోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం నుంచి ప్రారంభం కానుందని అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎంఏ జావిద్ తెలిపారు. ఈ నెల 11వరకు పోటీలు జరుగుతాయన్నారు.

జీజీహెచ్ అధికారులకు లోకాయుక్త నోటీసులు

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రెమిడెసివిర్ ఇంజక్షన్ల మిస్సింగ్ వ్యవహారంపై ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని ఆస్పత్రి అధికారులకు లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. కరోనా మొదటి, రెండవ దశలో జిల్లా ఆస్పత్రిలో కోవిడ్ సెంటర్‌కు ప్రభుత్వం రెమిడెసివిర్ ఇంజక్షన్లు సరఫరా చేసింది. ఇవి ఆస్పత్రి వర్గాలు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై కౌన్సిల్ ఫర్ సివిల్ రైట్స్ అనే సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలను కోరింది. సమాచార హక్కు చట్టం కింద రికార్డుల పరిశీలన, సమాచార హక్కు కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ విభాగం ఆదేశాలతో జీజీహెచ్‌లో రికార్డులు పరిశీలించేందుకు సీసీఆర్ సంస్థ ప్రతినిధులు ప్రయత్నించారు. కానీ వీరిపై జీజీహెచ్ సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదైంది. దాంతో సీసీఆర్ ప్రతినిధులు హైకోర్టులో స్క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది విచారణలో ఉండగా రెమిడెసివిర్ ఇంజక్షన్ల మిస్సింగ్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 28న విచారణకు హాజరు కావాలని ఆస్పత్రి అధికారులకు నోటీసులు జారీ చేశారు.

అమ్మను కొలిచే పండుగ నేడే..

- ఉదయం 8 గంటలకు గ్రామదేవతల ఊరేగింపు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తిచేసిన సర్వ సమాజ్ కమిటీ
- పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

ఊరంతా మెచ్చే పండుగ వచ్చేసింది. అమ్మను కొలవడానికి ఇందూరు సర్వసమాజం సన్నద్ధమైంది. శనివారం రాత్రి నుంచే వేడుక ప్రారంభం కానుంది. ఆదివారం ఉదయం ఊరపండుగ జరగనుంది. ఖిల్లాలోని తేలు మైసమ్మ గద్దె నుంచి ఊరేగింపు ప్రారంభిస్తారు. వేడుకకు సంబంధించి బల్దియా అధికారులు, సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు ఏరాట్లు చేశారు.

సండే స్పెషల్

ఖిల్లా నుంచి మహాలక్ష్మి ఆలయం వరకు..

ఊర పండగ కార్యక్రమంలో భాగంగా 18 గ్రామ దేవతలకు శారదమ్మ గద్దె వద్ద సర్వసమాజ్ కమిటీ పూజలు చేశాక అక్కడి నుంచి వాటితో ఊరేగింపు మొదలవుతుంది. గ్రామ దేవతల ఊరేగింపు ఖిల్లా వద్ద ప్రారంభమై వివేకానంద చౌరస్తా, గురుద్వార్, పెద్దబజార్ చౌరస్తా, గోల్‌హన్మాన్, పూలాంగ్‌చౌరస్తా, వినాయక్‌నగర్ మీదుగా మహాలక్ష్మి ఆలయం వరకు కొనసాగనుంది. ఈ మార్గంలో గ్రామదేవతలను ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడ ప్రతిష్ఠించనున్నారు.



నగరంలోని నకాష్ గల్లీలో ముస్తాబైన దేవతామూర్తులతో సర్వసమాజ్ కమిటీ సభ్యులు

నిజామాబాద్ సిటీ : గ్రామ దేవతలను కొలిచేందుకు ఇందూరు సర్వసమాజం సన్నద్ధమైంది. వేడుకకు సంబంధించి బల్దియా అధికారులు, సర్వసమాజ్ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో ఏటా ఆషాఢ మాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం ఊర పండుగను జరుపుకుంటున్నారు. గత మంగళవారం గ్రామ దేవతలకు నగరంలోని ఐదు ప్రాంతాల్లో బండారు పోయటంతో ఊర పండగకు సంబంధించి కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు సర్వ సమాజ్ కమిటీ సభ్యులు మొదట సిర్నాపల్లి గడి నుంచి పూజ సామగ్రి, పట్టువస్త్రాలు తీసుకుని కొండే హన్మాండ్లు ఆలయం వద్ద ఉన్న వడ్లదాతి వద్దకు వెళ్లి సార్గలమ్మ, కొండల రాయుడు విగ్రహాలు తీసుకుని కోటగల్లి బాలికల హైస్కూల్ ప్రాంతంలో నాలుగు ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. అనంతరం అక్కడి నుంచి ఖిల్లా వద్ద ఉన్న శారదమ్మ గద్దె వద్ద అడెల్లి పోచమ్మ, పాడలమ్మ, పెద్దమ్మ, మత్తడి పోచమ్మ, మహాలక్ష్మి అమ్మ, ఐదు చేతుల పోచమ్మ, రాట్నం, పులి విగ్రహాలకు సర్వసమాజ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేస్తారు. పూజల అనంతరం ఉదయం 8 గంటలకు సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.



ఊర పండుగ సందర్భంగా నగరంలోని ఖిల్లా వద్ద ముస్తాబవుతున్న గ్రామ దేవతల గద్దె

'సరి' విశిష్టత

ఊరపండుగలో వినియోగించే 'సరి'కి ఎంతో విశిష్టత ఉంది. మాతలకు సమర్పించే సరి అనే ప్రసాదానికి ఖిల్లా ప్రాంతానికి దగ్గరలో ఉన్న వివేకానంద చౌరస్తా(గాజుల్‌పేట్)లో పూజలు నిర్వహించి సరిను గ్రామ దేవతలకు సమర్పిస్తారు. సరి కోసం ప్రజలు ఉత్సాహం చూపుతారు. నవధాన్యాలు, పిండితో సరిని తయారు చేస్తారు. ఈ సరిని ఇళ్లపై, ఎడ్లపై చల్లితే అనారోగ్యం దరి చేరదని నగరవాసుల అపార నమ్మకం.

భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలోని ఖిల్లా నుంచి మహాలక్ష్మి కాలనీలోని మహాలక్ష్మి ఆలయం వరకు జరిగే ఊర పండుగ కోసం పోలీసుశాఖ భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు డీసీపీ, ఏసీపీ, 10 మంది సీఐలు, 25 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు 500 మందితో బందోబస్తు చేస్తున్నారు. కమ్యూనల్ ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలు ఏర్పాటు చేశారు. వజ్ర వాహనాన్ని ఉంచామన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీపీ పేర్కొన్నారు.

కిక్కిరిసిన మేకల సంత

- రూ. 3 కోట్లపైనే లావాదేవీలు
- ఊర పండుగ, వన భోజనాల ప్రభావం

నవీపేట మండల కేంద్రంలో శనివారం జరిగిన మేకల సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. ఈ ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ఊర పండగతో పాటు వనభోజనాల సందడి ఉండడంతో ఒక్క సారిగా క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఈ సంతలో క్రయవిక్రయాలు జరిపారు. ఇక్కడి నుంచి వరంగల్, ఉమ్మడి కరీంనగర్, హైదరాబాద్, ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలకు లారీల్లో, ఆటోలు, వ్యాన్లలో మేకలను కొనుగోలు చేసి తీసుకెళ్లారు. వర్షంతో సంత ప్రాంగణం చిత్తడిగా మారిన వ్యాపారులు, వినియోగదారులు లెక్క చేయకుండా విక్రయాలు జరిపారు. ఈ సంతలో రూ. 3 కోట్లపైనే లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

- నవీపేట/ సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నవీపేటలో శనివారం మేకల క్రయవిక్రయాలు

చేప పిల్లల ఉత్పత్తి ప్రారంభం

- ఎస్సారెస్పీలోని ఉత్పత్తి కేంద్రంలో మొదలైన ప్రక్రియ
- 10 కోట్ల స్పాన్ సేకరణ కోసం..
- 2.5 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యం



తల్లి చేపల నుంచి వచ్చిన గుడ్లు




తల్లి చేపల నుంచి గుడ్ల సేకరణకు ఇంజెక్షన్ ఇస్తున్న ఏడీ, ఎఫ్‌డీవో, సిబ్బంది

బాల్కొండ : శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ దిగువన అస్రాయి కాలనీ సమీపంలోని జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియను శనివారం మత్స్యశాఖ ఏడీ రాజ నర్సయ్య ప్రారంభించారు. చేప పిల్లల కేంద్రంలో జార్ హెచరీ మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఎకో హెచరీ ద్వారా చేపపిల్లల ఉత్పత్తిని ప్రారంభించారు. ప్రస్తుత సంవత్సరం ఎస్సారెస్పీలోకి సకాలంలో వరద నీరు వచ్చి చేరలేదు. అయినా చేప పిల్లల కేంద్రంలో అందుబాటులో ఉన్న నీటితో ఉత్పత్తిని ప్రారంభించారు. 10 కోట్ల స్పాన్‌ను గుడ్లు నుంచి తీసి 2.8 కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నట్లు ఏడీ తెలిపారు. చేపగుడ్లను పొదుగు వేసి బాయిల్డ్ ప్రక్రియ ప్రారంభించారు. జాతీయ చేప పిల్లల కేంద్రంలో ఇది వరకే మూడు కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. పునరుద్ధరణ పనులతో సామర్థ్యం 5 కోట్లకు పెరిగింది. తల్లి చేపల నుంచి సేకరించిన గుడ్లను హెచరీలో పొదుగు వేసి బాయిల్డ్ చేస్తారు. మూడు రోజుల తర్వాత స్పాన్ ఉత్పత్తి అవుతుంది. స్పాన్ నుంచి చేప పిల్లల ఉత్పత్తి జరుగుతుంది. ఉత్పత్తి అయిన చేప పిల్లలను సిమెంట్ కుండీల్లో నిల్వ ఉంచుతారు.

అంగుళం సైజ్ తర్వాత మత్స్య సహకార సంఘాలకు సబ్సిడీపై సరఫరా చేస్తారు. జిల్లాలోని చెరువులకు సరిపడా చేప పిల్లల ఉత్పత్తి ఈ కేంద్రంలోనే చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. కార్యక్రమంలో మత్స్యాభివృద్ధి అధికారి డోలిసింగ్, ఫీల్డ్‌మెన్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- జూలై వచ్చినా జాడలేని వానలు
- బోరుబావుల కిందే పంటల సాగు
- ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యంతో రైతన్నకు తిప్పలు



నిజామాబాద్‌నాగారం: ప్రతియేటా వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ తగ్గుతుంది. అయితే ఈ సంవత్సరం మాత్రం సకాలంలో వర్షాలు కురవలేదు. జూన్‌లో వర్షాలు లేవు. జూలై ప్రారంభమైన ఇంకా వర్షాలు రావడం లేదు. ఎండలు మండుతున్నాయి. దీంతో పంటల సాగు కోసం రైతులు బోరుబావులను ఆశ్రయించడంతో ఈయేడు వర్షాకాలంలో నిజామాబాద్ జిల్లాలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. అయినా రైతులు కొండంత అండతో మేలో కురిసిన వర్షాల చూసి పంటల సాగుకు అడుగు ముందుకు వేశారు. దుక్కి దున్ని ఇప్పటికే చాలా చోట్ల రైతులు తుకం(వరి) పోశారు. మాక్లూర్, వర్ని, బోధన్, కోటగిరి తదిత ప్రాంతాల్లో వరినాట్లు వేశారు. పలు చోట్ల కేవలం బోరుబావిల కింద రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధం అయ్యారు.

జిల్లాలో 1.75 లక్షల బోరుబావి కనెక్షన్లు

ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో రైతులు అందరు బోరుబావుల కిందే పంటలు సాగు చేసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 1లక్ష 75వేల బోరు బావి కనెక్షన్లు ఉన్నాయి. వీటి కిందే పంటల సాగవుతుంది. జలశయాలు, చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో రైతులకు బోరుబావులే దిక్కు అయ్యాయి. దీంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 5.3 మిలియన్ యూనిట్ల నుంచి 9.8మిలియన్ యూనిట్ల వరకు సరఫరా అవుతుంది. అయినా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు

విద్యుత్ డిమాండ్ పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్స్ ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ఒక్క జూన్ నెలలో 376 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఫెయిల్ అయ్యాయి. ఈ నెలలో 5 రోజుల్లో 80కిపైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయ్యాయి. రైతులకు ఇబ్బందులు లేకుండా వెనువెంటనే మరమ్మతులు చేసి అందిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

24 గంటలు సరఫరా చేస్తున్నాం

ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులున్నాయి. ఎప్పుడు లేనివిధంగా జూన్, జూలైలో విద్యుత్ డిమాండ్ ఎండకాలంలో మాదిరిగానే 9.8మిలియన్ యూనిట్లు ఖర్చు అవుతుంది. రైతులకు, వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మ్ ఫెయిల్ కావడంతో ఇబ్బందులు లేకుండా వెంటవెంటనే ట్రాన్స్‌ఫార్మర్లను అందించడానికి, మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం.

- రవీందర్, విద్యుత్ ఎస్‌ఈ

ఎస్సారెస్పీకి జలకళ

- ఏకకాలంలో ఎగువ, దిగువ నుంచి వస్తోన్న వరద
- కాళేశ్వరం ద్వారా ప్రాజెక్ట్‌లోకి 3వేల క్యూసెక్కుల రాక
- ఎగువ ప్రాంతం నుంచి సాధారణ వరద 2,909 క్యూసెక్కులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ఎస్సారెస్పీలోకి వస్తున్న కాళేశ్వరం నీళ్లు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఏకకాలంలో ఎగువ, దిగువ నుంచి నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్ట్‌లోకి 2909 క్యూసెక్కుల నీరు వస్తోంది. కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువలో నీటిని తరలించి ఎస్సారెస్పీలోకి శుక్రవారం వదలడం ప్రారంభించారు. దీంతో 3 వేల క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతం నుంచి ప్రాజెక్ట్‌లోకి వచ్చిచేరుతుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రధానంగా మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చిచేరుతుంది. ఎగువన ఉన్న గోదావరి నీటి ఆధారంగానే ఎస్సారెస్పీని నిర్మించారు. కాని కాలక్రమేణా ఎగువన బ్యారేజీలు ఎక్కువ కావడంతో నీటి లభ్యత ఉన్నా దిగువకు రావడం గగనమైంది. దీంతో ప్రాజెక్ట్‌కు దిగువన ఉన్న కాళేశ్వరం నుంచి 30 టీఎంసీల నీటిని తీసుకొచ్చి ఎస్సారెస్పీని నింపాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాని ప్రకారం ప్రాజెక్ట్‌లోకి దిగువ నుంచి కూడా నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. దిగువ నుంచి వస్తున్న నీరు ఎస్సారెస్పీలోకి ముప్కాల్ మండల కేంద్ర శివారు బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం వద్ద కలుస్తుంది. ఎగువ నుంచి వచ్చే నీరు నేరుగా గోదావరి నుంచి వస్తుంది కాబట్టి కందకుర్తి వద్దే కలుస్తుంది. ఎస్సారెస్పీ, కాళేశ్వరం సంగమం వద్దకు రైతులు తరలివచ్చి తిలకిస్తు న్నారు. ప్రాజెక్ట్ నీటిమట్టం 1091 (90 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1065.60(21.10 టీఎంసీలు) ఉంది.

క్లుప్తంగా

ఓపెన్ ఎంబీఏకు దరఖాస్తుల ఆహ్వానం



నిజామాబాద్‌అర్బన్: ఐసెట్ రాయని వారు నేరుగా ఎంబీఏ చేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో దరఖాస్తు చేసుకోవాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, ఓపెన్ యూనివర్సిటీ సమన్వయకర్త రంజిత తెలిపారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఓపెన్ యూనివర్సిటీలో ఎంబీఏ కోసం నిర్వహించే పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్, హెచ్‌ఆర్, ఆపరేషన్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 31 వరకు యూజీ, పీజీలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 10 నుంచి పీజీ మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు..

ఇందల్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న చేగుంట గురుకులంలో బాలికలకు, 11న నర్సాపూర్ గిరిజన బాలుర గురుకులంలో బాలురకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి మెమో, టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డ్, ఫొటోలు తీసుకొని ఉదయం 11 గంటలలోపు హాజరు కావాలని సూచించారు.

నవీన్‌కు డాక్టరేట్



బోధన్: బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లికి చెందిన మేము సైతం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు గైని నవీన్ కుమార్‌కు డాక్టరేట్ అందుకున్నారు. పాండిచ్చేరి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ సామాజిక సేవలను గుర్తించి డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. శనివారం ఆ యూనివర్సిటీ నిర్వహించిన స్నాతకోత్సవంలో నవీన్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నారు.

ఆదాయమున్నా.. వసతులు సున్నా

- చినుకు పడితే.. చిత్తడే
- నవీపేట సంత ప్రాంగణంలో సౌకర్యాలు కరువు
- కనీసం తాగునీరు లేక ప్రజల ఇబ్బందులు

నవీపేట: నవీపేట మేకల, కూరగాయాల సంతల్లో కనీస సౌకర్యాలు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉత్తర తెలంగాణలో పేరుగాంచిన మేకల సంత నవీపేట మండల కేంద్రంలో ప్రతి శనివారం జరుగుతుంది. అలాగే ప్రతి శుక్రవారం ఇదే ప్రాంతంలో వారాంతపు కూరగాయల సంత జరుగుతుంది. రెంజల్ మండలం సాటాపూర్‌లో జరిగే మేకల సంతను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు రెండు దశాబ్దాల కిందట ఆరె కటికె సంఘం సహకారంతో నవీపేటకు తీసుకువచ్చారు. సౌకర్యాలు కల్పిస్తామని వ్యాపారులను నమ్మించి చాకచక్యంగా నవీపేటకు తీసుకువచ్చారు. ఆగ్రహించిన సాటాపూర్ ప్రజాప్రతినిధులు, వీడీసీ ప్రతినిధులు కోర్టు ఆశ్రయించగా...కొన్నాళ్లు అనధికారికంగానే వేలం పాటలు నిర్వహించారు. కానీ మూడేళ్ల కిందట నవీపేటకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో వేలం పాటను అధికారికంగా నిర్వహిస్తున్నారు.

రూ.లక్షల్లో ఆదాయం

అనధికారికంగా మేకల సంతకు వేలం నిర్వహించగా గుత్తేదారులదే హవా కొనసాగేది. సిండికేటుగా ఏర్పడిన ఒకే గ్యాంగ్ ఆది నుంచి ఈ వేలంను దక్కించుకుంటూ 'వసూళ్ల'లో మంచి పట్టు సాధించింది. మూడేళ్లుగా ఈ వేలం పాటలు పారదర్శకంగా సాగుతున్నాయి. సిండికేటుకు క్లోం వేసిన జీపీ పాలకవర్గం ఆదాయానికి ప్రాధాన్యతనిచ్చింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మేకల వ్యాపారులు ఈ సంతలో క్రయవిక్రయాలు జరుపుతారు. ఈ ఏడాది నిర్వహించిన వేలంలో మేకల సంతకు రూ.55 లక్షలు, వారాంతపు కూరగాయల సంతకు రూ.15 లక్షల ఆదాయం వచ్చింది.



సంత ప్రాంగణం ప్రధాన ద్వారం వద్ద నిలిచిన వర్షం నీరు

వేలంలో నవీపేట సంత ఆదాయం

సంవత్సరం	మేకల సంత	వారం సంత
2021–22	43,12,000	10,01,000
2022–23	33,70,000	10,64,000
2023–24	55,16,000	15,00,000

కనీస సౌకర్యాలు కరువు

మేకల వ్యాపారులను నమ్మించి సాటాపూర్‌లో జరిగే సంతను నవీపేటకు తీసుకువచ్చారు. కానీ సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. ఆదాయంపై దృష్టి సారించిన జీపీ పాలకవర్గం సౌకర్యాలను సమకూర్చడంతో పూర్తిగా విఫలమయ్యింది. సంతకు వచ్చే మూగజీవాల(మేకలు, గొర్రెలు)కు తాగునీటి తొట్టిలు, వ్యాపారులు, వినియోగదారులకు మంచి నీటి కుళాయిలు లేవు. అప్పుడెప్పుడో 20 ఏళ్ల కిందట నిర్మించిన మంచి నీటి ట్యాంకులు పాడయ్యాయి. వీటిని శుభ్రం చేసే వారు కరువయ్యారు. సంత ప్రాంగణంలో మొరం, మట్టి ఉండడంతో వర్షాకాలంలో చిత్తడిగా మారుతుంది. అడుగు తీసి అడుగేయాలంటే భయపడుతున్నారు. ఆవరణలో వర్షపు నీటిని మళ్లించేందుకు మురికి కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీంతో వర్షపు నీరు నిలిచి సంత ప్రాంగణం బురదమయంగా మారుతోంది. ఆవరణను సీసీగా మారిస్తే మూగజీవాల నడకకు ఇబ్బంది అవుతుందనే సాకుతో జీపీ పాలకవర్గం నిర్మాణానికి దూరంగా ఉంటుంది. సీసీ కాకపోయిన గట్టి మొరంతో ఆవరణను చదునుగా చేసి, మంచి నీటి సౌకర్యం, మురికి కాలువల విస్తరణ, రేకుల షెడ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని కోరుతున్నారు.



అధ్వానంగా మంచి నీటి ట్యాంక్

బురదలోనే విక్రయాలు



నవీపేట అంగడిలో వానాకాలం కష్టమైతుంది. మొత్తం బురదగా ఉంటుంది. బురదలో కింద కూర్చుని కూరగాయలను అమ్ముతున్నా. తైబజార్ రుసుం ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కానీ ఒక్క సౌకర్యం సరిగ్గా లేదు.

– ప్రహ్లాద్, కూరగాయల రైతు, అబ్బాపూర్ తండా

సౌకర్యాలు కల్పించడం లేదు



సంతలో సౌకర్యాలు కల్పిస్తామని ప్రతిసారి జీపీ పాలకవర్గం వేలం పాట సమయంలో హామీ ఇస్తుంది. కానీ సంతృప్తికర సౌకర్యాలు కల్పించడం లేదు. తాగునీటి వసతి లేదని ఇటీవల దూరప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు నన్ను నిలదీశారు. జీపీ పాలకవర్గాన్ని అడుగగా తాత్కాలిక మినరల్ వాటర్ డబ్బాలను ఏర్పాటు చేశారు.

– న్యాంతాబాద్ శంకర్, ఆరె కటికె సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపాం..

సంత ప్రాంగణంలో వసతులు కల్పించేందుకు రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే బురద మట్టి తొలగింపు, మురికి కాలువల నిర్మాణం, తాగునీటి వసతు లు కల్పిస్తాం. తాగునీటికి ఇబ్బంది ఉండవద్దని ప్రస్తుతం తాత్కాలికంగా డబ్బాలు ఏర్పాటు చేశాం.

– రవీందర్ నాయక్, జీపీ కార్యదర్శి, నవీపేట

యజమానులకు బదులు పనివారికి శిక్ష

- బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాల నియంత్రణ కోసం..
- బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ శాఖ

మోర్తాడ్: బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలను తాము సూచించిన విధంగా కొనసాగించాలని చెబుతున్న ఎక్సైజ్ శాఖ ముందస్తు చర్యలుగా బైండోవర్ పద్ధతిని అనుసరిస్తుంది. బెల్టుషాపుల యజమానులపై చర్యలు తీసుకోవడానికి బదులు అందులో పని చేస్తున్న కార్మికులపై ఎక్సైజ్ అధికారులు విచిత్ర ధోరణి అవలంభిస్తున్నారు. తహసీల్దార్‌ల ముందు బైండోవర్ చేసే క్రమంలో బెల్టుషాపుల యజమానులను కాకుండా పని చేసేవారిని బైండోవర్ చేస్తూ ఎక్సైజ్ శాఖ చేతులు దులుపుకుంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన వైన్‌షాపుల ద్వారానే మద్యం అమ్మకాలను కొనసాగించాలి. అయితే ప్రభుత్వానికి మద్యం ద్వారానే ఎక్కువ ఆదాయం లభిస్తుండటంతో లక్ష్యానికి అనుగుణంగా లిక్కర్ అమ్మకాల కోసం బెల్టుషాపులకు అధికార యంత్రాంగం అనధికార అనుమతులు ఇచ్చి కొనసాగింపచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ సర్కిల్ కార్యాలయాల పరిధిల్లో 102 లైసెన్స్ పొందిన మద్యం దుకాణాలు ఉంటే సుమారు 500 బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. బెల్టుషాపులలో మద్యం కల్తీ జరుగుతుందనే ఉద్దేశ్యంతో ఫుల్‌బాటిళ్లు, ఆఫ్ బాటిళ్ల అమ్మకంను అధికారులు నిలిపివేయించారు. కేవలం బీర్లు, 180 ఎంఎల్, 90 ఎంఎల్ సీసాల్లోనే మద్యం అమ్మకాలను కొనసాగించాలని ఎక్సైజ్ అధికారులు ఆదేశించారు. తమ ఆదేశాలు పక్కాగా పాటించాలంటే బెల్టుషాపుల నిర్వాహకులను తహసీల్దార్ల ముందు బైండోవర్ చేస్తే ముందు ముందు భారీ జరిమానాలను తప్పించుకోవడానికి చెప్పినట్లు వింటారని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే బెల్టుషాపుల నిర్వాహకులను బైండోవర్ చేస్తున్నారు. ఈ బైండోవర్ చేసే క్రమంలో యజమానులను వదిలి పొట్టకూటి కోసం పని చేసుకుంటున్న కార్మికులను తహసీల్దార్ల ముందు నిందితులుగా నిలబెడుతున్నారు. చాలా గ్రామాల్లో మద్యం దుకాణాల యజమానులే బెల్టుషాపులను నిర్వహిస్తున్నారు. అసలైన వారిని వదిలి పని చేసేవారిపై ఎక్సైజ్ శాఖ పెత్తనం చేయడం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు అంటున్నారు. ఈ విషయమై 'సాక్షి' ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించగా సమాధానం ఇవ్వకుండా దాటవేయడం గమనార్హం.



ఏర్గట్ల తహసీల్దార్ ఎదుట బెల్టుషాపులో పనిచేసే వ్యక్తిని బైండోవర్ చేస్తున్న దృశ్యం

అర్హత లేకున్నా పదోన్నతులు!

నిజామాబాద్‌నాగారం: నగర కార్పొరేషన్‌లోని శానిటేషన్ విభాగంలో ఇటీవల పలువురికి అర్హత లేకున్నా, నిబంధనలు పాటించకుండా పదోన్నతులు కల్పించడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. నగరంలోని ఆరు జోన్‌ల పరిధిలోని ఏడుగురికి ఇటీవల జవాన్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ పోస్టుకు శానిటేషన్ సంబంధించిన హెల్త్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. కానీ ఎవరూ కూడా ఈ కోర్సు పూర్తి చేయలేదు. పైగా విద్యార్హతలు కూడా 10వ తరగతిలోపు ఉన్నాయి. పదోన్నతులు ఇవ్వాలంటే కచ్చితంగా సీనియార్టీతో పాటు విద్యార్హతలు పరిశీలించిన తర్వాతే పదోన్నతులు కల్పించాలి. ఇక్కడ అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. శానిటేషన్ విభాగంలో సీనియార్టీలో ముందు వరుసలో ఉన్న ఓ ఉద్యోగి తనకు పదోన్నతి రావడం లేదని ఇప్పటికే మున్సిపాలిటీలోని మేనేజర్, ఆఫీస్ సూపరింటెండెంట్, ఎంహెచ్‌ను కలిసిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. తనకన్నా జూనియర్లకు పదోన్నతి ఇచ్చారని... తనకు అన్యాయం జరిగిందని అడిగిన అధికారులు పొంతనలేని సమాధానం చెబుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

కమిషనర్ దృష్టి సారిస్తేనే..

మున్సిపల్ కమిషనర్ దృష్టి సారిస్తేనే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. కీలకమైన అధికారికి పెద్ద ఎత్తున ముడుపు అందడంతోనే అక్రమంగా పదోన్నతులు కల్పించారని జోరుగా చర్చ జరుగుతుంది. ఈ ఘటనపై కమిషనర్ దృష్టిసారిస్తే అసలు నిజాలు బయటకు వచ్చే అవకాశం లేకపోలేదు.

చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(బి) తండాలో బాల్యవివాహం చేసుకున్న వ్యక్తితో పాటు సహకరించిన పెద్దలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత డిమాండ్ చేశారు. ఈ ఘటనపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. 13 ఏళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి పెళ్లి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫకీరాబాద్ గ్రామానికి చెందిన 45 ఏళ్ల సాయెబ్‌రావు బాలిక తండ్రి ప్రకాష్‌కు రూ.60 వేలు ఇచ్చి ఈ పెళ్లి చేసుకున్నాడని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు అనిత, సీపీఎం మండల నాయకులు నాయక్‌వాడీ శ్రీనివాస్, దేవేందర్‌సింగ్ పాల్గొన్నారు.



జగిత్యాల డీసీఆర్‌బీకి నవీపేట్ ఎస్సై

ఖలీల్‌వాడి: నవీపేట్ ఎస్సైగా పని చేస్తున్న రాజారెడ్డికి సీఐగా పదోన్నతి లభించడంతో జగిత్యాలలోని డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. బదిలీ సంబంధించిన ఉత్తర్వులు రావడంతో సోమవారం జగిత్యాలకు వెళ్తున్నట్లు పోలీస్‌వర్గాల ద్వారా తెలిసింది. మరికొంత మందికి సీఐ పదోన్నతి రాగా డీఐజీ సెలవులో ఉండటంతో ఉత్తర్వులు ఆగినట్లు తెలిసింది. ఈ నెల 12 తర్వాత జిల్లాలో పోలీసు శాఖలో బదిలీ ప్రక్రియ ప్రారంభమవుతుందని సమాచారం.

కేజ్‌వీల్ ట్రాక్టర్ సీజ్



ధర్పల్లి: మండలంలోని మైలారం గ్రామ శివారులో పట్టీలు లేకుండా రహదారిపై తిరుగుతున్న కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడపరాదని, పట్టీలు లేకుండా నడిపితే సీజ్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అక్రెడిటేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

సుభాష్‌నగర్: జిల్లాలో మూడో విడత మీడియా అక్రెడిటేషన్ కార్డుల మంజూరు కోసం అర్హులైన ప్రతినిధులు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని డీపీఆర్‌వో పద్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, ఒరిజినల్ మేనేజ్‌మెంట్ లెటర్లను కలెక్టరేట్‌లోని డీపీఆర్ఓ కార్యాలయంలో 20వ తేది సాయంత్రం 4 గంటల్లోపు అందజేయాలని సూచించారు.

మంచి ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలి

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ సిటీ : కేసీఆర్ ప్రభుత్వ పథకాల ద్వారా సమాజంలో ఉన్న 99 శాతం మంది ఏదో ఒక రకంగా లబ్ధి పొందుతున్నారని, లబ్ధి పొందుతున్న కొందరు ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను, తనను తిడుతున్నారని వీరిని ప్రజలే కట్టడి చేయాలని రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోవాలని కోరారు. శనివారం నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్(ఎం) జగదాంబ మాత ఆలయంలో ఆర్టీసీ చైర్మన్ గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో మూడు వేల ఎకరాల పోడు భూములు 1,623 మంది గిరిజనులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఒక్కో ఎకరం విలువ రూ. 25 లక్షలకు తక్కువ ఉండదని, ఈ లెక్కన నియోజకవర్గంలో రూ. 425 కోట్ల విలువ చేసే పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. రూరల్ మండలంలోని మల్కాపూర్ తండా, గాంధీ నగర్, చక్రధర్ తండా, మల్లారం, ధర్మారం తండా గ్రామాలకు చెందిన 138 మంది లబ్ధిదారులకు 115.27 ఎకరాలకు పోడు పట్టాలు పంపిణీ చేశామన్నారు. మాజీ ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీజీ గౌడ్ మాట్లాడుతూ గిరిజనుల చేతికి పట్టాలు అందక ముందే రైతుబంధు వారి ఖాతాల్లో పడటం సీఎంకు రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధి నిరూపిస్తుందన్నారు. సర్పంచ్ హరిచంద్ గ్రామంలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ అనూష ప్రేమ్ నాయక్, జెడ్పీటీసీ సుమలత గోపాల్ రెడ్డి, సర్పంచ్ హరిచంద్, మధుకర్ రావు, సాయిలు, సంతోష్, అశోక్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

క్రైం కార్నర్

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

ఖలీల్‌వాడి: దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ సతీష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని నార్త్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని ఖిల్లా రోడ్డులో మొగలుపూర్ చెందిన హింగోరా మహమ్మద్ ఉస్మాన్ ఇంట్లో జూన్ 25న రాత్రి చోరీ జరిగింది. 14 తులాల బంగారు ఆభరణాలు, మూడు ఫోన్లు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం వర్ని చౌరస్తాలో ఎస్సై సాయినాథ్, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ఆపారు. దీంతో ప్రధాన నిందితుడు సద్దాక్ పారిపోగా ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుల్లో సద్దాక్‌తో పాటు దొడ్డి కొమురయ్య కాలనీకి చెందిన బాలుడు ఇంట్లోకి ప్రవేశించి దొంగతనం చేయగా అదే కాలనీకి చెందిన హూంశెట్టి రవి, కోటగల్లీకి చెందిన సాయినాథ్ విట్టల్‌రావు ముక్తే బయట ఉన్నారు. వీరి నుంచి బంగారు చైన్, రూ.17,850 నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ గిరి, పోలీస్ కానిస్టేబుళ్లు నీలేష్, వేణు, నరేష్, సుభాష్, రాజు, శంకర్ రావు, హోంగార్డులు సలావుద్దీన్, లతీఫ్, సలీమ్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ సతీష్

వృద్ధుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని గాయత్రీనగర్‌కు చెందిన కోలిగట లక్ష్మణ్(75) అదృశ్యం అయినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లిన లక్ష్మణ్ తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి మనవడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖిల్లా రోడ్డుకు చెందిన ఒకరు..

నగరంలోని ఐదో టౌన్ పరిధిలోని ఖిల్లా రోడ్డుకు చెందిన గౌరిమిండ్ల నారాయణ(75) అదృశ్యమైనట్లు ఎస్సై సాయినాథ్ తెలిపారు. మతి స్థిమితం సరిగా లేక ఏప్రిల్ 13న ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. నారాయణ కుమారుడు స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నమల్లారెడ్డిలో యువకుడు..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన సదుల కృష్ణ (25) ఈ నెల 6న ఉదయం కూరగాయలు తీసుకువచ్చేందుకు కామారెడ్డికి వచ్చాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చాలాచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో అతని సోదరుడు యాదగిరి శనివారం దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



సదుల కృష్ణ

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. గ్రామానికి చెందిన రైతు రేకుపల్లి నడ్పి గంగారం(59) తన పొలం వద్ద గడ్డి కోస్తుండగా బోరు మోటారుకు వెళ్లే కేబుల్ వైరు కట్ అయి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మాక్లూర్: మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన దీమర శ్రీనివాస్(45) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే శ్రీనివాస్ అతని స్నేహితుడు బైక్‌పై వెళ్తూ ఈ నెల 7న నవీపేట మండలం మహంతం గేట్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం అంబులెన్సులో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ ఇద్దరిలో దీమెర శ్రీనివాస్ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య రుక్మా, కుమారుడు ఉన్నారు.

దత్తపుత్రిక కోసం గొడవ

- కర్రలు, కత్తితో దాడి
- ఒకరికి గాయాలు
- తొమ్మిది మందిపై కేసు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో అర్ధరాత్రి కత్తిపోట్ల ఘటన కలకలం రేగింది. ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో దత్తపుత్రిక కోసం జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కొందరు తల్వార్, కర్రలతో దాడికి పాల్పడ్డారు. వివరాలు.. గౌతమ్‌నగర్‌కు చెందిన అజీముద్దీన్‌కు, ఆటోనగర్‌కు చెందిన సనాబేగంతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేకపోవడంతో అజీముద్దీన్ చెల్లెలు సమ్రీన్ కూతురును ఏడాది క్రితం దత్తత తీసుకున్నారు. తన కూతురును తిరిగి ఇవ్వాలని లేకుంటే రూ.లక్ష చెల్లించాలని సమ్రీన్ సోదరుడిని కోరింది. ఇందుకు సనాబేగం అంగీకరించలేదు. దీంతో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో నెల క్రితం సనా బేగం పుట్టింటికి కూతురితో వెళ్లింది. శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో సనా బేగం, ఆమె సోదరులు, బంధువులు గౌతమ్‌నగర్‌కు వచ్చారు. వీరితో పాటు నయీమ్, ఆవేజ్, షదాబ్ మాట్లాడానికి వచ్చారు. మాట్లాడే సమయంలో వారి వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో రెండు కుటుంబాల సమస్య పరిష్కరించడానికి అర్ధరాత్రి 12 గంటలకు అమీర్ అలియాస్ బర్సాత్ ఆమీర్, అర్మాన్ మాలిక్, సిరాజ్, ముదస్సిర్, మోహసిన్ ఆటోనగర్ నుంచి గౌతమ్‌నగర్‌కు వచ్చారు. అజీముద్దీన్ ఇంట్లో లేకపోవడంతో అతని సోదరుడు మాజిద్‌ను అవేజ్ కర్రతో కొట్టగా, అమీర్ తల్వార్‌తో పొడిచేందుకు యత్నించాడు. ఈ క్రమంలో మాజిద్ ఎడమ చేతికి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రావడంతో గొడవ సద్దుమణిగింది. చికిత్స నిమిత్తం మాజిద్‌ను జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దాడికి పాల్పడిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిసింది.



గాయపడిన మాజిద్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భిక్కనూరు: మండలంలోని శ్రీసిద్ధరామేశ్వరనగర్ శివారులోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా నవీపేట గ్రామానికి చెందిన గయ సింగారం రాకేశ్ మెదక్ జిల్లా నిజాంపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన లింగాల మహేశ్ భిక్కనూరు నుంచి రామాయంపేట వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఎర్టిగా కారు వీరిని ఓవర్‌టేక్ చేసి సడెన్ బ్రేక్ వేయడంతో బైక్‌తో ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యుల సూచలన మేరకు రాకేశ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మహేశ్ కామారెడ్డి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.



ధ్వంసమైన బైక్

చెరువులో ఒకరి గల్లంతు

సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామ ఊర చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ఒకరు గల్లంతైనట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. గ్రామానికి చెందిన తూము సుదర్శన్ చేపలు పట్టడానికి ఊర చెరువులోకి తెప్పపై వెళ్లాడు. మరి కొందరు ఒడ్డున ఉన్నారు. ఐదు నిమిషాల అనంతరం చూసేసరికి తెప్పపై లేకపోయేసరికి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఈతగాళ్లు కొందరు చెరువులో దిగి గాలించినప్పటికి సుదర్శన్ ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో గాలింపు నిలిపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గల్లంతైన వ్యక్తికి భార్య రజిత, ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.